క్లుప్తంగా

ఫోర్త్ టౌన్ సీఐగా ఉమాకాంత్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సిహెచ్.ఉమాకాంత్ నియమితుడయ్యారు. ప్రస్తుతం సోషల్ మీడియా సెల్, కోర్టు మానిటరింగ్ సిస్టంలో ఇన్‌స్పెక్టర్‌గా ఈయన విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా ఉన్న ఎ.సత్యనారాయణను సోషల్ మీడియా సెల్, కోర్టు మానిటరింగ్ సిస్టం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

ప్రజల కోసమే కవిత్వం


మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనం శ్రోతలను అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవి ప్రజల హృదయాల్లో ఉదయిస్తాడన్నారు. ప్రజల కోసం కవులు కవిత్వం రాయాలని సూచించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వ రీతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.చినసూర్యనారాయణ, వినయ భూషణ్, కె.వి.ఎస్.మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, పరమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ తదితరులు స్వీయ కవితా పఠనం చేసి అలరించారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలని వినతి


జోన్-5 కమిషనర్‌కు రాముకు వినతిపత్రం అందిస్తున్న వరప్రసాద్

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార, మాన్యం ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రామును బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. వార్డులోని పలు కాలనీల్లో నివాసులు యూజీడీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మాధవధార శ్మశాన వాటికలో కొత్త బోరు ఏర్పాటు చేసి పైప్‌లైన్ నిర్మించాలని, సత్యానగర్ కొండవాలు ప్రాంతంలో కొత్తగా మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు వరప్రసాద్ చెప్పారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం


కోర్సు ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం కోర్సుకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని తెలిపారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కోర్సుకు అవసరమైన వ్యవస్థను నిర్మించే దిశగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి వచ్చే సమయానికి క్వాంటమ్ రంగంలోని సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. విభిన్న విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు ప్రత్యక్షంగా పాల్గొని ఆచార్యులకు శిక్షణ అందిస్తారన్నారు.

పేకాటాడుతున్న ఆరుగురు మహిళల అరెస్టు

తాటిచెట్లపాలెం: లలితానగర్ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్న ఆరుగురు మహిళలను బుధవారం ఫోర్త్‌టౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు చేసిన పోలీసులు సదరు మహిళల నుంచి రూ. 22 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



14వ వార్డులో 251 సచివాలయం పక్కన నరికి వదిలేసిన చెట్ల కొమ్మలు



నరికారు.. వదిలేశారు..!

- 14, 45 వార్డుల్లో ఎక్కడ చూసినా చెట్ల కొమ్మలే..
- నెలన్నర రోజులుగా తొలగించని అధికారులు
- ఎండిపోయి రోడ్డంతా విస్తరిస్తున్న వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



నరసింహనగర్ రోడ్డులో దీప్ భవన్ పక్కన వదిలేసిన చెట్ల కొమ్మలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14, 45 వార్డులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలు నరికి రోడ్ల పక్కన వదిలేశారు. ఇలా తొలగించిన వాటిని రెండు, మూడు రోజుల్లోగా తరలించాల్సి ఉంది. చాలా చోట్ల నెలన్నర రోజులవుతున్నా.. తొలగించకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నరసింహనగర్‌లో పలు చోట్ల నెలన్నర నుంచి గుట్టలుగా, కుప్పలుగా చెట్ల కొమ్మలు పేర్చి వదిలేశారు. నరసింహనగర్ పరిసర ప్రాంతాల్లో గిరి ప్రదక్షిణకు ముందు ఆఘమేఘాల మీద చెట్ల కొమ్మలు నరికారు. ఇలా కొట్టేసిన కొమ్మలను కొన్ని చోట్ల తొలగించి, చాలా చోట్ల ఇప్పటికీ అలానే వదిలేశారు. చెట్ల కొమ్మలు, ఆకులు ఎండిపోయి రోడ్డంతా విస్తరిస్తున్నాయి.

స్థానికుల ఆందోళన

14వ వార్డు నరసింహనగర్‌లోని వెన్నెల గెస్ట్ హౌస్ ఎదురుగా జీవీఎంసీ పార్క్‌లో సచివాలయం ఉంది. ఈ పార్క్‌లోనే 45వ వార్డు శానిటేషన్ కార్యాలయం కూడా ఉంది. ఈ సచివాలయం ముందు, పక్కన చెట్ల కొమ్మలను నరికి సుమారు రెండు నెలలైంది. వీటిని వాటిని తొలగించలేదు. 45వ వార్డులో ఇనార్బిట్ మాల్ వెనుక వైపు నరసింహనగర్ రోడ్డులోని దీప్ భవన్ ముందు, పక్కన చాలా చెట్ల కొమ్మలు నరికారు. సుమారు నెల రోజుల నుంచి వాటిని తొలగించకుండా వదిలేశారు. ఇవి కూడా ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ ఎండిన చెట్ల కొమ్మల పక్కనుంచి హై టెన్షన్ విద్యుత్ వైర్లు వెళ్తున్నాయి. పొరపాటున వీటికి అగ్ని అంటుకుంటే జరిగే నష్టం అధికమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విష కీటకాలు, పాములు

జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేస్తున్నపుడు వచ్చిన చెత్తాచెదారాన్ని కూడా చెట్ల కొమ్మల గుట్టల్లోకి తోసేస్తున్నారని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఈ కొమ్మలను తరలించకుండా వదిలేయడం వల్ల విష కీటకాలు, పాములు చేరే అవకాశముందని, చీకటి సమయంలో ఇవి రోడ్ల మీదకు వస్తే ప్రమాదమని స్థానికుల భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమ ప్రాంతాల్లో నరికి వదిలేసిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

> **తక్షణం తరలించాలి**
> **నరసింహనగర్ ప్రాంతంలో చాలా చోట్ల చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది నరికి రోడ్ల పక్కన వదిలేశారు. సుమారు నెలన్నర రోజులవుతున్నా వాటిని తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం చెట్ల కొమ్మలను** తరలించాలి.
> – ఎ.మధు, నరసింహనగర్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 'గైస్' విద్యార్థినుల ప్రతిభ


ఉద్యోగాలు పొందిన విద్యార్థినులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన బిర్లా పెయింట్స్, ఒపస్ పెయింట్స్‌కు నిర్వహించిన ఉద్యోగ నియామక ఇంటర్వ్యూల్లో వివిధ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన నలుగురు బాలికలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఎస్.చంద్రజ్యోతి (పెట్రో కెమికల్స్), ఎం.చరిష్మా (పెట్రో కెమికల్స్), ఎస్.కోమలి(కెమికల్ ఇంజనీరింగ్), కె.ప్రతిభ(ఆయిల్ టెక్నాలజీ)లకు రూ.3.3 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు కంపెనీ పంపించిన ఉత్తర్వులను బుధవారం విద్యార్థినులకు ప్రిన్సిపాల్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థినులను వివిధ విభాగాధిపతులు సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డాక్టర్ దామోదర్, ఎం.మహాలక్ష్మి, డాక్టర్ ఎం.విజయలక్ష్మి, టీపీవో కేబీవీఎస్ఎస్ కుమార్ అభినందించారు.

ఘనంగా దేవమాత మోక్షరోపణ ఉత్సవాలు


జెండా ఎగరేస్తున్న ఫాదర్లు


నవదిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని క్యాథడ్రల్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో 125 వసంతాల దేవమాత మోక్షరోపణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. పారిస్ పాస్టిల్ కౌన్సిల్, విచారణ గురువు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం నవ దినాల ప్రార్థనలు (నొవీనా) నిర్వహించారు. ఖమ్మం డయోసిస్‌కు చెందిన రెవరెండ్ ఫాదర్ సూరేపల్లి ఐజక్ ముఖ్య అతిథిగా హాజరై 125 వత్సరాల పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం నవదిన ప్రార్థనలు, దివ్యబలి పూజలు చేశారు. పరిశుద్ధ బైబిల్‌లో మరియమాతకు ఉన్న ప్రాముఖ్యతను, జూబ్లీ ఉత్సవాల చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. బెలూన్లతో తయారు చేసిన భారీ జపమాలను ఫాదర్లు గాలిలో ఎగురవేశారు. సాయంత్రం దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీప్‌గుర్తు వీధి, రొసిలియన్ తదితర ప్రాంతాల్లో పల్లకీ ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు రాఖీ శోభ






రక్షా బంధన్ పండగ శోభతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ఈ నెల 9వ తేదీ శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, జ్ఞానాపురం పరిసర ప్రాంతాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ వైరటీల్లో కొత్త రకం రాఖీలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పెద్ద దుకాణాలతో పాటు రహదారులు, ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న స్టాళ్లు ఏర్పాటు వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ ఏడాది వ్యాపారులు రాఖీల ధరలు కాస్తా ఎక్కువగా పెంచి విక్రయిస్తున్నారు. అక్కచెల్లెమ్మలు తమ అన్నదమ్ముల చేతికి కట్టేందుకు మార్కెట్‌లో నచ్చిన రాఖీలు కొనుగోలు చేస్తున్నారు. రాఖీలతోపాటు మిఠాయి దుకాణాలు సందడిగా కనిపిస్తున్నాయి.

– కంచరపాలెం

తల్లిపాలలో సంపూర్ణ పోషకాలు


గొల్ల కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుమిత

కంచరపాలెం: తల్లిపాలలో బిడ్డకు అవసరమైన సంపూర్ణ పోషకాలన్నీ లభిస్తాయని ఆర్పీ పేట అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ జి.మధుమిత అన్నారు. 56వ వార్డు గొల్ల కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. నవజాత శిశువుల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్టమైనవన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, హెచ్‌వీ జె.భారతి, ఏఎన్ఎం బి.భారతి, బి.పైడితల్లి, స్వాతి, మహిళా పోలీస్ ప్రభావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 57వ వార్డు తుమ్మడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్, ఐసీడీఎస్ సంయుక్తంగా తల్లిపాల వారోత్సవాలను వేడుకగా నిర్వహించారు. తల్లిపాలలో అన్ని పోషకాలు-విటమిన్స్, మినరల్స్, ప్రొటీన్స్ లభిస్తాయన్నారు.

యువజన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ప్రొఫెసర్లు

మద్దిలపాలెం: అంతర్జాతీయ యువజన దినోత్సవం – 2025 ఉత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 12న ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఇంటర్‌ఫెయిత్ డైలాగ్, యూత్ ఎంగేజ్మెంట్ ప్రోగ్రాంతో కొనసాగనుంది. కార్యక్రమాన్ని యోస్ వి కేన్ యువజన సంస్థ(విశాఖపట్నం), ఆర్థిక శాస్త్ర విభాగం, ఆగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్(భారత ప్రభుత్వం), ఏయూ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.లిల్లీ గ్రేస్ యూనిస్, ప్రొఫెసర్ డి.ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఎక్కడా మాతృ మరణాలు సంభవించరాదని, ఒక వేళ అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైద్యులు, ఏఎన్ఎంలతో ఆయన మాట్లాడారు. ఇటీవల బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందని, దీనిపై సంబంధిత వైద్యులు, ఇతర సిబ్బంది సమాధానం చెప్పాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కారాదన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడే హైరిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించి తగిన వైద్య సలహాలు అందించాలని తెలిపారు. గర్భిణికి సాధారణ ప్రసవం జరిగేటట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ లూసీ, డాక్టర్ విద్యారమ, డాక్టర్ షర్మిలాకుమారి, డాక్టర్ వీవీ శ్రావణ్, డాక్టర్ రమ్యచిత్ర, డాక్టర్ ఎన్.వి.సమత, విమెన్ హెల్త్ ఆఫీసర్, డాక్టర్ బి.నాయుడు, 108 జిల్లా సమన్వయ అధికారి త్రినాథరావు, యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.సత్యవతి, డాక్టర్ ఆర్.రేవతి, డాక్టర్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీ కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2025 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గతంలో ప్రకటించిన గడువు ఇటీవల ముగియడంతో ఆగస్టు 15 వరకు పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.